టికీ కొనసాగుతోంది.

న్యాయశాస్త్రపరమైన తగాదాలను కాజీలు తీరుస్తుండేవారు. సివిల్ లాకు సంబంధించి హిందువుల మధ్య తగాదాలు కూడా కాజీయే తీర్చేవాడు. ఆయనకు సహాయం చేయడానికి హిందూ శాస్త్ర పండితులు నియుక్తులయ్యేవారు.

పర్సనల్ లాలో భేదాలుండినప్పటికీ హిందువులకూ మహమ్మదీయులకు ఒకే విధంగా వర్తించే చట్టం ఒకటుండేది. అదే క్రిమినల్ లా. నేరాలకు ఖురాన్‌లో పేర్కొన్న శిక్షలు విధించడం జరిగేది. శిక్షలు చాలా కఠినంగా వుండేవి. శిరచ్ఛేదంట కాళ్ళూ చేతులూ నరికి వేయడం వంటి శిక్షలు అమల్లో వుండేది. దొంగతనం చేసినందుకు చేతులు నరికేవారు. అయితే హత్య జరిగినప్పుడు హతుడు తాలూకు కుటుంబీకులు రక్తధనం తీసుకోవడానికి అంగీకరిస్తే హంతుకుడ్ని వదిలేసేవారు. లేదంటే అతనికి శిరచ్ఛేదం జరిగింది. ఇది ఆనాటి న్యాయవ్యవస్థలో ప్రత్యేకంగా గమనించదగిన అంశం. మొత్తానికి స్థూలంగా చెప్పాలంటే రక్తానికి రక్తం, ప్రాణానికి ప్రాణం అనేదే ఆనాటి వారు శిక్షలు విధించడంలో అనుసరించిన పద్ధతి.

హిందూలా, ముస్లింలా, క్రిమినల్ లా— ఇవికాక రాజుగారు విధించే ఆజ్ఞలు కూడా చట్టాలుగా అమలు జరిగేవి. అటువంటి ఆజ్ఞలనే ఫర్మాన్లు అనేవారు. ఆచార వ్యవహారాల్ని బట్ట కూడా తీర్పులివ్వడం జరిగేది. అయితే చెల్లుబడి కాగల ఆచారాలుగా అవి గుర్తింపు పొంది వుండాలి కాగా ఒక తీర్పు చెప్పడానికి ఎలాంటి ఆధారమూ లేనప్పుడు న్యాయమూర్తి న్యాయానుసారం తన విజ్ఞతను వినియోగించి తీర్పు చెప్పవచ్చు.

మహమ్మదీయ ప్రభువులు న్యాయానికీ చట్టానికీ భగవంతుడే కర్తగా విశ్వసించేవారు. భూలోకంలో న్యాయాన్ని అమలు పరచడంలో తాము భగవంతుడి ప్రతినిధులని నమ్మేవారు. అందుకే న్యాయపాలన సక్రమంగా జరపడానికి చాలా శ్రద్ధ తీసుకునేవారు. న్యాయమూర్తి అయిన కాజీని నియమించడంలో ఔరంగజేబు కేటాయించినంత సమయం మరే అధికారి నియామకంలో కేటాయించేవాడు కాదు. ఇక జహంగీరు ధర్మగంట జగత్ప్రసిద్ధం.

చట్టం ముందు అందరూ సమానులే అనేది మహమ్మదీయ ప్రభువుల ప్రధాన సిద్ధాంతం. రాజు కూడా చట్టానికి అతీతుడు కాదు. చట్టం ముందు ప్రజలూ ప్రభువూ అనే తేడా లేదు. ముఖ్యంగా మొగల్ చక్రవర్తులు ఈ నియమాన్ని శ్రద్ధగా పాటించారు. న్యాయమూర్తి అయిన కాజీ నిర్ణయాలకు రాజుకూడా బద్ధుడే. ఒక్కోసారి రాజాజ్ఞలు న్యాయబద్ధంగా లేకపోతే వాటిని కొట్టిపారేయగల అధికారం కూడా కాజీకి వుండేది. రాజు కుటుంబీకులు నేరాలు చేస్తే వారికి శిక్ష పడ్డ సంఘటనలు ఎన్నో వున్నాయి.

జహంగీరు కాలంలో ఒక పోలీస్ కొత్వాలు తన కింది ఉద్యోగి భార్యను చేజిక్కించుకునే దురుద్దేశంతో ఆ ఉద్యోగిని డ్యూటీ మీద ఇంటి నుంచి దూరంగా పంపించాడు. ఆ ఉద్యోగి తల్లి జహంగీరు ధర్మగంటను మోగించడంతో జహంగీరు స్వయంగా ఆ కేసు విచారించి కొత్వాలుకు కారాగార శిక్ష విధించాడు.

గుజరాతు నవాబు అహమ్మద్ షా కాలంలో స్వయానా రాజుగారి అల్లుడే ఒక హత్య చేయడం జరిగింది. హంతకుడికి కాజీ జరిమానా విధించాడు. అయితే రాజు స్వయంగా ఆ తీర్పు మార్చి హంతకుడికి మరణశిక్ష విధించాడు.

ఎంత న్యాయశీలురైనప్పటికీ ముస్లిం ప్రభువుల్లో పరమత సహనం తక్కువగా వుండేది. ఔరంగజేబు వంటి రాజులు హిందువులకు తల పన్నువంటి అవమానకరమైన పన్నులు విధించి శాశ్వతంగా అపకీర్తి పాలయ్యారు. అయితే అక్బర్ కాలంలో పరమత సహనం పరాకాష్ఠకు చేరుకుంది. హిందువుల సంక్షేమం కోరి అక్బర్ ఎన్నో చట్టాలు చేశాడు. అయితే అక్బరు రాజకీయ ప్రయోజనాలను ఆశించి హిందువుల్ని చేరదీశాడని విమర్శించే వారున్నారు. రాజకీయ ప్రయోజనం లేనిదే ఏ రాజూ ఏ మంచీ చేయడు. రాజకీయంతో వున్న చిక్కే అది. అక్బర్ మత భ్రష్టుడని తిట్టిపోసే సనాతనవాదులూ వున్నారు ఆ విధంగా పాపం అక్బరు చక్రవర్తి రెంటికీ చెడ్డాడు.

# యురేకా!

సినిమా ముందు క్యూలో టిక్కెట్టు కోసం నిల్చున్న నేను అప్పటికి ఆరోసారి విసుక్కున్నాను. థియేటర్ యజమాన్యం మీద — అసలు టిక్కెట్లు ఇస్తున్న ఛాయలే కనిపించటం లా. తలపైన సూర్యుడు నిప్పులు చెరుగుతుంటే అందరూ తలకు కర్చీఫ్‌లు అడ్డు పెట్టుకుంటున్నారు. వారందరిదీ ఆ బాధతే — పారిపోతున్నా పట్టుకుని కళ్ళకు చలవంటూ అర్థసేరు ఆముదం తలకు పట్టించి పంపిన బామ్మను విసుక్కుంటూ నిల్చున్నాను నేను.

టిక్కెట్లు ఇస్తున్నారా లేదా అనుకుంటూ బుకింగ్‌వైపు తలపెట్టి చూసి తలప్రక్కకు తిప్పిన నాకు — అటువైపు లేడీస్ క్యూకట్టి నిలుచున్న వరుసలో గులాబీరంగు పంజాబీ డ్రస్ ధరించిన ఒకమ్మాయి నావైపు చూసి నవ్వటం కనిపించి ఉలిక్కిపడ్డాను. మరోసారి ఆ అమ్మాయి వైపు చూసాను. అనుమానంతో — నిజమే నన్ను చూస్తూ నవ్వుతున్నది. వెనక్కు దువ్విన తలవెంట్రుకలకు క్లిప్ తగిలించి వదులుగా విడిచేసిన జుట్టుతో — పెదవులకు లైట్‌గా టచ్ చేసుకున్న లిప్‌స్టిక్‌తో బ్యూటీ పార్లర్‌కు రోజూ వెళ్తున్నదానిలా కన్పించింది నాకు ఆఅమ్మాయి. గర్వంగా కాలర్ సర్దుకుని క్రాపు సరిచేసుకున్న నన్ను నేను మరో మారు పరికించి చూసుకున్నాను. బ్లాక్ ప్యాంట్‌పై వైట్ షర్ట్ టక్ చేసి కాళ్ళకు లెదర్ స్లిప్పర్స్ ధరించాను. ఆ అమ్మాయి నవ్వుతుంటే అలానే చూడబుద్ధివుతున్నది నాకు. కాస్తంత ధైర్యం చేసి నేనూ చిన్నగా నవ్వాను ఇపుడు ఆ అమ్మాయి తన ముందు నిల్చున్న స్నేహితురాలికి నన్ను చూపించి నవ్వుతున్నది. తన స్నేహితురాలు కూడా నావైపు చూస్తూ చిన్నగా చిరునవ్వు నవ్వింది. 'యురేకా...' అని గట్టిగా అరవాలినిపించిది నాకు.

అమ్మాయి తన స్నేహితురాలికి నా చేతి వైపు చూపిస్తూ తన నోటికి కర్చీఫ్ అడ్డు పెట్టుకుని గలగలా నవ్వుతున్నది. నాకనుమానమేసి నా చేతివైపు ఓమారు చూసుకున్నాను. చేతిలో కర్చీఫ్ తప్ప ఇంకేమీ కనిపించలేదు. కారణం ఏమిటబ్బా అనుకుని బుర్ర బరుక్కుంటూ కర్చీఫ్ కెల్లి చూసిన నాకు కర్చీఫ్‌కు ఎర్రగా అంటుకున్న బొట్టు అసహ్యంగా కన్పించింది. అప్పుడర్థమయ్యింది. ఆ అమ్మాయిల నవ్వుకు కారణం ఇక అక్కడ అరక్షణం కూడా నిలువలేదు. గాభరాగా టాయిలెట్‌లోకెల్లి అద్దంలో చూసుకున్న నాకు ముఖానికి తల నుంచికారిన ఆముదపు జిడ్డుతో సమ్మిళితమైన ఎర్రని బొట్టు అసహ్యంగా ముఖమంతా అంటుకుని ఉంది. అచ్చం పగటి వేషగాడిలాఉన్నాను. పారిపోయే ముందు అర్థసేరు ఆముదంతో పాటు బొటనవేలంత బొట్టు పెట్టిన బామ్మ గుర్తుకొచ్చి ఎక్కడ ఎవరెస్టు నుంచి క్రింద పడినట్టయ్యింది.

—సాహితీ చైతన్య